క్లుప్తంగా

సీఎంను కలిసిన ముత్యాలన్న



పుట్టపర్తి అర్బన్: తాడేపల్లిలోని కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రామగిరి మండలంలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయ చైర్మన్ కురుబ ముత్యాలన్న సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఆలయ అభివృద్ధికి ఇతోధికంగా సాయం అందించాలని కోరినట్లు ముత్యాలన్న పేర్కొన్నారు.

'కుళ్లాయప్పపై చర్యలు తీసుకోవాలి'

కదిరి టౌన్: తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌కు చెందిన ప్రసాద్ కుమారుడు పవన్ మృతికి కారకుడైన కొక్కంటి క్రాస్ ఆర్‌ఎంపీ డాక్టర్ కుళ్లాయప్పపై చర్యలు తీసుకోవాలని కదిరి తాలూకా ఆర్‌ఎంపీ యూనియన్ అధ్యక్షుడు అల్లాబకష్ ఒక ప్రకటనలో కోరారు. 8 సంవత్సరాల బాలునికి ఇంజక్షన్ వేయడం సరికాదన్నారు. ఇలాంటి వ్యక్తిపై ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అబాకస్ పోటీల్లో సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులు

కదిరి అర్బన్: విజయవాడలో సోమవారం సిప్ అబాకస్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో కదిరి విద్యార్థులు సత్తా చాటారు. 8వ స్థాయినుంచి దీక్షిత ఛాంపియన్‌గా నిలవగా, 5వ స్థాయి నుంచి కార్తికేయన్ 2వ స్థానం, రెండవ స్థాయి నుంచి భవిష్య 2వ స్థానంలో నిలిచారు. పతకాలు అందుకున్నారు. కార్యక్రమంలో అబాకస్ నిర్వాహకురాలు మాధవి కేదార్ పాల్గొన్నారు.

స్ప్రింక్లర్ పైపుల చోరీ

తాడిమర్రి: మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామంలో మేడాపురం వెంకట రత్నం అనే రైతుకు చెందిన 25 స్ప్రింక్లర్ పైపులు చోరీకి గురయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడాపురం వెంకటరత్నం గ్రామంలో యానిమేటర్‌గా (మహిళా సంఘాల నిర్వహణ) పనిచేస్తున్నాడు. తనకున్న ఎనిమిది ఎకరాల్లో మల్బరీ, మరో ఏడు ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తున్నాడు. రబీ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంటకోత అనంతరం 25 స్ప్రింక్లర్లను తోటవద్ద ఏర్పాటు చేసుకున్న షెడ్‌వద్ద నిల్వ చేశాడు. సోమవారం మల్బరీతోటకు నీరు పెట్టడానికి వెళ్లగా స్ప్రింక్లర్ పైపులు చోరీకి గురైనట్లు గుర్తించారు. సుమరు రూ.25 వేలు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సంఘటనపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

పక్కా భవనాలు నిర్మించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: కదిరి పట్టణంలో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న బీసీ కళాశాల, బాల,బాలికల వసతి గృహాలకు పక్కాభవనాలు నిర్మించాలని సోమవారం తహసీల్దార్ నటరాజ్‌కు ఏఐఎస్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఈ రెండు వసతిగృహాలు పట్టణానికి దూరంగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ఉపేంద్ర, టిప్పు, జన, సిద్దిక్ పలువురు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈఓ-1 మున్వర్ బాషా మాట్లాడుతూ ఆత్మీయట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. ట్రస్ట్‌చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, డైరెక్టర్లు రాజశేఖర్, పరమేశ్వరరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం, అమర్నాథ్‌రెడ్డి తదితరులున్నారు.

ఇద్దరికి గాయాలు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కాళసముద్రం గ్రామంలో సోమవారం జరిగిన మొహరం వేడుకల్లో పట్నం గ్రామానికి చెందిన రాజశేఖర్, అశోక్‌లకు గాయాలయ్యాయి. వేడుకల్లో కాళసముద్రం, పట్నం గ్రామానికి చెందిన యువకులు ఘర్షణ పడ్డారు. పట్నం గ్రామానికి చెందిన యువకులకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. తోపులాటలో మాటా మాటా పెరిగి ఘర్షణ జరిగినట్లు తెలిసింది.

పరిశుభ్రతకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి



సమావేశంలో సమస్యలు విన్నవిస్తున్న కౌన్సిల్ సభ్యులు

• మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం రూరల్: ప్రస్తుతం వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కాచర్ల లక్ష్మి, కమిషనర్ బండి శేషన్న అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజెండాలోని 72 అంశాలను సిబ్బంది చదివి వినిపించగా కౌన్సిలర్లు ఆమోదించారు. వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, కౌన్సిలర్లు శివయ్య, చందమూరి నారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా వీధి లైట్లు, పారిశుధ్యం, కుక్కల బెడద తదితర సమస్యలను పరిష్కరించాలని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్, చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టణ పరిశుభ్రతకు కౌన్సిలర్లు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దోమల నివారణ కోసం వార్డుల వారీగా ఫాగింగ్ చేయిస్తామన్నారు. ముఖ్యంగా ఇంటింటి చెత్త సేకరణను రోజూ చేపడతామన్నారు. చెత్త పన్ను సరిగా వసూలు కాలేదని, ఈ విషయంపై కౌన్సిలర్లు కూడా సహకరించాలని కోరారు.

వైస్ చైర్‌పర్సన్ కృతజ్ఞతలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మైనార్టీలకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని, అందులో భాగంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గానేతనను ఎంపిక చేశారని షంషాద్ బేగం తెలిపారు. తన ఎంపికకు సహకరించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈఈ సత్యనారాయణ, మేనేజర్ ఆనంద్, డీఈ వన్నూరుస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహబూబ్ బాషా, శ్యామ్సన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి





మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పరికి నజీమున్నీషా, హాజరైన కౌన్సిలర్లు

కదిరి టౌన్: ప్రతి వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీషా అధ్యక్షతన సోమవారం జరిగింది. కౌన్సిల్ సమావేశం 26వ వార్డులో లేఅవుట్లు పుట్టగొడుగులా పుట్టకొస్తున్నాయని సదరు వార్డు కౌన్సిలర్ ఎంఎస్ ఫయాజ్ సభ దృష్టికి తీసుకొచ్చారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అనుమతులు లేని లే అవుట్లు రద్దు చేయాలన్నారు. టిడ్కో ఇళ్ల కోఆర్డినేటర్ మురళి బాధితులను ఇబ్బందులు పెడుతున్నాడని, అతన్ని విధుల నుంచి తొలగించాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. పార్నపల్లి వాటర్ స్కీమ్‌లో పనికి కొత్త వారిని తీసుకోకుండా, ఉన్నవారితోనే పనిచేయించుకోవాలని సూచించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి చంద్రానాయక్‌ను విధుల్లోకి తీసుకోకుడదని గత కౌన్సిల్‌లో అధికారులకు తెలిపినా, తీసుకున్నారని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొమ్ముగంగాదేవి ఆరోపించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీవారిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబు మాటలు నమ్మొద్దు



దివ్యాంగునికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుంటూ మోసాలకు పాల్పడుతున్న చంద్రబాబు నాయుడు మాటలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రజలకు సూచించారు. మండలంలోని పెద్దన్నవారిపల్లి పంచాయతీలో మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, సీనియర్ నాయకులు పురుషోత్తం రెడ్డి, ఎంపీపీ రఫినాయక్ ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పలువురు సీసీ రోడ్లు వేయించాలని, అసైన్‌మెంట్ భూములు సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు మంజూరు చేయించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. తాగు నీటి సమస్య, ఇళ్ల మంజూరు విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే.. ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయం ఆసన్నమవుతున్న వేళ చంద్రబాబు ప్రస్తుత పథకాలకు పేర్లు మార్చి మాయ మాటలు చెబుతున్నాడన్నారు. ఆయన నమ్మరాదని సూచించారు. అనంతరం మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయిన నేపథ్యంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కులశేఖర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామక్రిష్టారెడ్డి, మాజీ సర్పంచ్‌లు సూర్యనారాయణరెడ్డి, పయాజ్ అహమ్మద్, క్రిష్టారెడ్డి, సేవాదళ్ జోన్ ఇన్‌చార్జ్ డీకే బాబు, శ్రీమత్ లక్ష్మినరసింహస్వామి టెంపుల్ చైర్మన్ జరిపిటి గోపాల క్రిష్ణ, సర్పంచ్‌లు శ్రీరామ్ రెడ్డి, షేక్షావలి, సుగుణమ్మ, పెద్దినాయుడు, వెంకటనారాయణ, సుదర్శన్‌రెడ్డి, దేవేంద్రనాయక్, సీనియర్ నాయకులు రామాంజనేయులు, రాంకుమార్, పవన్‌కుమార్, మర్రిరామయ్య, గంగిరెడ్డి, మల్లికార్జున నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా 11,335 ధ్రువపత్రాల పంపిణీ

బత్తలపల్లి: 'జగనన్న సురక్ష' గ్రామసభల్లో 11,335 ధ్రువపత్రాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సౌజన్యకుమారి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. కార్యక్రమాన్ని జూలై 1 నుంచి 27 వరకూ నిర్వహించినట్లు తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రాలు 5,288, ఆదాయం 5,212, జనన-8, మరణ- 1, కుటుంబ- 9, కొత్త రేషన్‌కార్డులు 7, కుటుంబ సభ్యుల మార్పులు, చేర్పులు 532, వివాహ ధ్రువపత్రాలు 2, కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం 4, పాసు పుస్తకంలో సవరణలు 1, ఇతరత్రా 271, మొత్తం 11,335 ధ్రువపత్రాలను ఉచితంగా అందించామని వివరించారు.

18,377 ధ్రువీకరణ పత్రాల అందజేత

ధర్మవరం రూరల్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎంపీడీఓ సౌజన్య కుమారి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ అర్హత ఉండి కొన్ని కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారికి 'జగనన్న సురక్ష' ద్వారా ధ్రువీకరణ పత్రాలను అందజేశామన్నారు. ధర్మవరం మండల వ్యాప్తంగా 18,377 వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు ఆమె తెలిపారు.

ఘనంగా పెద్ద కాశీంస్వామి చివరి దర్శనం



చివరి దర్శనం గావిస్తున్న ముజావర్లు

బత్తలపల్లి: మొహర్రం వేడుకల అనంతరం రెండు రోజులకు పెద్దకాశీంస్వామికి నిర్వహించే జార్తాల్ (దినాలు) వేడుకలను బత్తలపల్లి, సంజీవపురం గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సోమవారం పీర్లమకాన్ వద్ద స్వాములకు ప్రత్యేక చదివింపులు గావించారు. పెద్ద కాశీంస్వామి చివరి దర్శనం చేసుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చక్కెర చదివించుకున్నారు. చివరి దర్శనం అనంతరం పీర్లను ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్‌బాషా, నజరుల్లా, కాశీంవలిలు ఖాశీంస్వామికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఆలయంలోని అటకమీద భద్రపరిచారు.

ప్రశాంతంగా జలధి కార్యక్రమం

ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో భేటీ అనంతరం సాయంత్రం జలధి కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. గ్రామ సమీప ప్రదేశాలకు పీర్లను ఊరేగింపుగా తరలించి అక్కడ వాటిని నీటితో కడిగి తిరిగి పీర్ల చావిడికి ముజావర్లు తరలించారు. పీర్ల మకాన్‌కు తరలించే సమయంలో 'ఆల్‌బీదాయే' అనే విషాద గీతాన్ని ఆలపిస్తూ ముజావర్లు దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఉత్సవాలు అన్ని గ్రామాల్లో ప్రశాంతంగా నిర్వహించడానికి ఎస్ఐ టీవీ శ్రీహర్ష నేతృత్వంలోని పోలీసు సిబ్బంది ప్రజలకు సూచనలు, సలహాలు అందించారు. మొహర్రం ముగిసిన మూడవ రోజున పీర్లకు జార్తాల్ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అన్ని పీర్ల మకాన్‌ల వద్ద మంగళవారం ముజావర్లు నిర్వహించనున్నారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో మొహర్రం ఉత్సవాల్లో భాగంగా సోమవారం పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చావిడిలో కొలువుదీరిన పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలకంరించారు. సాయంత్రం జరిగిన పానకాలు, చక్కర చదివింపు కార్యక్రమంలో భక్తులు పాల్గొని పీర్ల స్వాములను దర్శించుకున్నారు. అనంతరం పీర్ల స్వాములను గ్రామంలో ఊరేగింపు చేశారు.

గుండెపోటుతో టీచర్ మృతి



పోతులయ్య

ముదిగుబ్బ: ముదిగుబ్బ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు (55) పోతులయ్య సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. కొత్తచెరువు మండలం కేశాపురం గ్రామానికి చెందిన పోతులయ్య అనంతపురంలో ఇల్లు నిర్మించుకొని అక్కడే నివాసం ఉంటున్నారు. రోజూ ముదిగుబ్బకు వచ్చి వెళ్లేవారు. సోమవారం తన నివాసంలో ఉండగా ఛాతిలో నొప్పి ఉందని కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు చికిత్స నిమిత్తం ప్రవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతునికి భార్య సుగుణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సబ్సిడీతో విత్తనాలివ్వాలి

కనగానపల్లి: రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సబ్సిడీ ధరతో విత్తనాలు అందించాలని ఏపీ రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మహదేవ, బాలరాజు అధికారులకు వినతిపత్రం అందించారు. సబ్సిడీ ధరతో కొర్ర, జొన్న, రాగులు, పెసర వంటి విత్తనాలు అందించాలన్నారు. రైతు సంఘం నాయకులు మహానంద, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

నివేశన స్థలాలు మంజూరు చేయండి

ఎన్‌పీకుంట: ఇళ్లు నిర్మించుకోవడానికి మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిని గుర్తించి నివేశన స్థలాలు మంజూరు చేయించాలని అంబేడ్కర్ నగర్ కాలనీ వాసులు సోమవారం తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు వినతి పత్రం అందించారు. ఆర్డీటీ సంస్థవారు సుమారు 90 కుటుంబాలకు చెందిన కాలనీ వాసులకు ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి ముందుకు వచ్చారన్నారు. నివేశన స్థలాలు కేటాయించాలని కోరారు. సర్పంచ్ ఆంజినమ్మ, శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రెడ్డప్ప, తదితరులు ఉన్నారు.

అర్హులైన ప్రతి రైతుకూ పట్టాలు

ఎన్‌పీకుంట: అర్హులైన ప్రతి రైతుకూ అసైన్డ్‌మెంట్ కమిటీలో ప్రభుత్వం తరపున డీ పట్టా మంజూరు చేస్తామని తహసీల్దార్ నరేంద్ర కుమార్ అన్నారు. మరికొమ్మదిన్నె గ్రామ పొలం సర్వే నంబరు-1798 సంబంధించి అటవీశాఖకు అప్పగించిన భూముల హద్దులను సోమవారం తహసీల్దార్ పరిశీలించారు. డివిజన్ రేంజర్ అధికారి రమానాయక్, బీట్ అధికారిణి మంజుల, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగిపై దాడి

అమడగూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కులశేఖర్ రెడ్డిపై ఓడీచెరువు మండలం టీ కుంట్లపల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు.తలుపుల మండలం, నంగివాండ్లపల్లికి చెందిన కులశేఖర్ రెడ్డి అమడగూరు రెవెన్యూ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో స్వగ్రామం వెళుతుండగా చెర్లోపల్లి డ్యాం సమీపంలో ముగ్గురు లిఫ్ట్ కావాలని అడగ్గా వాహనాన్ని ఆపాడు. అంతలోనే వారు దాడికి పాల్పడి సెల్‌ఫోన్ పగులకొట్టి రూ. 8,700 డబ్బు లాక్కెళ్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపాడు.

శివారు కాలనీలు అభివృద్ధి చేస్తాం



అనాథ పిల్లల వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: పట్టణంలో శివారు ప్రాంతాల్లోని కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 27వ వార్డులో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నిర్వహించారు. కాలనీలో మట్టి రహదారులతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన ఎదుట వాపోయారు. వీధిలైట్లు పడలేదని, మార్చాలని కోరారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందలేదని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే.. సచివాలయ ఉద్యోగులను పిలిచి పథకాలను వర్తించేలా చూడానలి ఆదేశించారు. కాలనీలో తల్లిదండ్రులు లేని అనాథలైన ఇద్దరు పిల్లల వివరాలు తెలుసుకున్న తెలుసుకుని, చిన్నారులను ప్రభుత్వ హాస్టల్‌లో చేర్పి చదువు నేర్పించేలా చూడాలని సూచించారు. శివారు ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతున్నామని, డ్రైనేజీల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే తెలిపారు. నీరు ఒకచోటకు చేరేలా కాలువలు నిర్మాణం చేసిన అనంతరం సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, చైర్‌పర్సన్ వేముల జయరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ దోలా ఓబుళమ్మ, వార్డు ఇన్‌చార్జ్ దోలా రాజారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులున్నారు.

పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం



గాండ్లపెంట: పనులు ప్రారంభిస్తున్న నాయకులు



పుట్టపర్తిలో పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డును చైర్మన్ తంగా ఓబులపతి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజల సౌకర్యార్థం పెద్ద ఎత్తున రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. గత ప్రభుత్వంలో పుట్టపర్తి మున్సిపాలిటీ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. తమ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న,టౌన్ కన్వీనర్ రంగారెడ్డి,కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి,కో ఆప్షన్ సభ్యుడు రఫీ ,నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ మాదవరెడ్డి,మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి,నాయకుల బిల్డర్ మల్లి, శంకర్, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, నాగిరెడ్డి, రఘునాథరెడ్డి, గోపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం

గాండ్లపెంట: మండల పరిధిలోని మలమీదపల్లి పంచాయతీ బనాన్‌చెరువుపల్లి గ్రామంలో రూ.10 లక్షల అంచనాతో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ తాతం జగన్మోహన్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో గ్రామస్తులు సీసీ రోడ్డు కావాలని కోరగా, వెంటనే మంజూరు చేశారన్నారు. మంజూరు చేసిన నిధులతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ రెడ్డి వరప్రసాద్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ జయచంద్రనాయుడు, పార్టీ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, వైస్ ఎంపీపీ భారతి ప్రతాపరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చలపతి, జయప్ప, రామక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో సత్తా

ధర్మవరం అర్బన్: తమిళనాడులో ఆదివారం జరిగిన రాబా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ఫెస్టివల్‌లో వెస్ట్రన్ డాన్స్‌లతో ధర్మవరం రాకింగ్ స్టార్స్ డాన్స్ అకాడమికి చెందిన లహరి, చరణ్‌తేజ్‌లతో సత్తా చాటారు. చరణ్, లహరికి సీనియర్ కొరియోగ్రఫర్ జానీ మాస్టర్ చేతులమీదుగా రాబా బుక్ ఆఫ్ రికార్డు నిర్వాహకులు అవార్డులు అందించారు. ఈ సందర్భంగా స్థానిక బీఎస్‌ఆర్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, ఉమాపతిలు సోమవారం అవార్డులు సాధించిన విద్యార్థులను అభినందించారు. రాకింగ్ స్టార్స్ డాన్స్ అకాడమీ డాన్స్ మాస్టర్లు అస్లాం, చంద్ర, లోకేష్‌లను పట్టణవాసులు అభినందించారు.

'న్యాయవాదులపై దాడులు అరికట్టాలి'

కదిరి టౌన్: న్యాయవాదులపై దాడులను అరికట్టాలని కదిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది శ్రీవితలను కిడ్నాప్ చేసి హత్య చేయడం బాధాకరమన్నారు. ఘటనను ఖండిస్తూ సోమవారం స్థానిక కోర్టులో విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకు రావాలని కోరారు. అనంతరం న్యాయవాది ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు.

సంక్షిప్త సమాచారం

రజక మహాసభకు తరలిరండి

ఎన్‌పీకుంట: పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఆగస్టు 13న నిర్వహించే రజక సంఘం ప్రథమ మహాసభకు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆంజినేయులు పిలుపునిచ్చారు. స్థానిక శివాలయం వద్ద సోమవారం మహాసభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను సంఘం సభ్యులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, మండల కన్వీనర్ వెంకటరమణ, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎనుములపల్లిలో పౌరహక్కుల దినోత్సవం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులతో పాటు దళితులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నవీన్‌కుమార్, అర్బన్ సీఐ బాలసుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కులాల ప్రయోజనాలను పరిరక్షించడానికి 1955లో పౌరహక్కుల చట్టం తీసుకొచ్చారన్నారు. అగ్రవర్ణాల వారు అభ్యంతరాలు తెలిపితే చట్ట ప్రకారం 6 నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీటీ నరసింహులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, వీఆర్‌ఓ అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రిక్స్ సాయి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఫీజు వసూలు చేయాలి

ధర్మవరం రూరల్: ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థుల నుంచి ఫీజులను వసూలు చేయాలని ఎంఈఓ రాజేశ్వరి ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలకు సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. ఏ తరగతికి ఎంత మేర ఫీజు చెల్లించాలో నోటీసు బోర్డుపై ఉంచాలన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులచే బోధించాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన పాఠశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు.

స్వచ్ఛ భారత్ రిసోర్స్ కో ఆర్డినేటర్ నియామకం

నల్లచెరువు: స్వచ్ఛ భారత్ మిషన్ ఫేస్-2లో మండల రిసోర్స్ కో ఆర్డినేటర్‌గా బత్తల విశ్వేశ్వర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శకుంతల ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణస్వామి, ఏఓటీ రామక్రిష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు

రామగిరి: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 8,392 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు ఈఓఆర్డీ రాధాకృష్ణ తెలిపారు. పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి, నసనకోట, మాదాపురం, రామగిరి, పోలేపల్లి, కుంటిమద్ది, గంతిమర్రి గ్రామాల్లో ఈనెలలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులందరికీ మొత్తం 8,392 వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.

ద్విచక్రవాహనం బోల్తా పడి వ్యక్తికి గాయాలు

కదిరి టౌన్: పట్టణంలోని జీవిమాను సర్కిల్‌లో ద్విచక్రవాహనం బోల్తా పడి నల్లచెరువు మండలం ఉప్పర్లవాండ్లపల్లికి చెందిన నాసీర్ బాషాకు చేయి విరిగింది. వ్యక్తిగత పనిమీద కదిరికి వచ్చి తిరిగి స్వగ్రామం ఉప్పరవాండ్లపల్లికి ద్విచక్రవాహనంలో వెళ్లుతుండగ కుక్క అడ్డురావడంతో ప్రమాదం జరిగింది.